


అనంతగిరిలోని శ్రీ అనంతపద్మనాభస్వామి ఆలయం

# వైభవంగా పెద్ద జాతర

## మహిమాన్వితుడు అనంత పద్మనాభుడు

- కొలిచిన వారికి కొంగుబంగారంలా అనంతపద్మనాభస్వామి ఆలయం
- ఘనంగా ఈ నెల 7న చక్రతీర్థంతో పరిసమాప్తం
- నిత్యం భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం
- ప్రత్యేక పూజలు చేసి మొక్కుల చెల్లింపులు

వికారాబాద్, డిసెంబర్ 2 : భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా.. పుణ్యక్షేత్రంగా విరజిలుతున్న శ్రీఅనంతపద్మనాభస్వామి ఆలయానికి నిత్యం భక్తుల తాకిడి పెరుగుతున్నది. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పెద్ద జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గత నెల 22న ప్రారంభమైన ఉత్సవాలు డిసెంబర్ 7న చక్రతీర్థంతో ముగియనున్నాయి. వికారాబాద్ పట్టణం నుంచి ఈ అనంతగిరిగుట్ట ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అనంతగిరి కొండల్లో స్వయంభుగా వెలిసిన స్వామివారిని కొలిచేందుకు భక్తులు వస్తుంటారు. శని, ఆదివారాల్లో రద్దీ భారీగా ఉంటుంది. జిల్లా ప్రజలే కాకుండా రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, సంగారెడ్డి తదితర జిల్లాలకు చెందిన వారు కూడా అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. స్వామివారిని దర్శించుకుంటే అనుకున్న పనులు అవుతాయని భక్తుల అపార నమ్మకం. ప్రతి ఏటా కార్తిక మాసంలో ఇక్కడ పెద్ద జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. అనంతపద్మనాభస్వామివారిని భక్తులు ఆలయ పుర వీధుల్లో రోజుకో వాహనంపై ఊరేగిస్తారు. నవంబర్ 22న ధ్వజారోహణం, పుణ్యాహవాచనంతో ప్రారంభమైన ఉత్సవాలు డిసెంబర్ 7న చక్రతీర్థంతో ముగుస్తాయి. ప్రతి రోజూ స్వామివారికి అర్చకులలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జాతరలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ, ఆర్అండ్‌బీ అధికారులు, పోలీసులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ఏర్పాట్లు చేస్తున్నారు.



ఆలయంలోని దేవతామూర్తులు

### భక్తులకు సకల వసతులు

స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. వాహనాల నిలుపుదలకు పార్కింగ్, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలలను ఏర్పాటు చేశారు. అంతేకాకుం డా వికారాబాద్ నుంచి తాండూరు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. రాత్రి సమయాల్లో ఆలయం వద్ద భక్తు లు ఉండేందుకు విద్యుత్ దీపాలను కూడా ఏర్పాటు చేశారు. జాతరలో తినుబండారాలు, ఆట వస్తువులకు స్థలాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో అద్దె గదులను నిర్మించారు. భగీరథ గుండం వద్ద షవర్లు, భక్తులకు ఎండ తగలకుండా రేకుల షెడ్లను ఏర్పాటు చేశారు. కార్తిక మాసం సందర్భంగా మహిళలు దీపాలు వెలిగించేందుకు ఉసిరి చెట్టు వద్ద కూడా ఏర్పాట్లు చేశారు.

### 18 సీసీ కెమెరాలతో నిఘా



ప్రతి ఏటా కార్తిక మాసంలో జరిగే పెద్ద జాతర ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. వారికి ఇబ్బందులు కలుగకుండా పుష్కరిణి వద్ద స్నానాల కోసం షవర్లు, దర్శనం అనంతరం బయటకెళ్లే భక్తులకు ఎండ తగులకుండా రేకుల షెడ్లు, మరుగుదొడ్లు, మూత్రశాలలను ఏర్పాటు చేశాం. భక్తుల కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు 18 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘాను పటిష్టం చేశాం. **-నరేందర్, ఆలయ ఈవో, వికారాబాద్**

### భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం



జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వాహనాల పార్కింగ్, తాగునీటి వసతులను ఏర్పాటు చేశాం. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీస్ అధికారులు, విద్యుత్తు, వైద్యారోగ్య, అగ్నిమాపక శాఖల సిబ్బందిని అప్రమత్తం చేశాం. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలి. **-పద్మనాభం, ఆలయ ఫౌండర్**



ఆలయ సమీపంలో ఆంజనేయస్వామి భారీ విగ్రహం



# విన్నింగ్.. బెట్టింగ్

- ఓట్ల కౌంటింగ్ వేళ జోరుగా పందేలు
- ప్రముఖులు నిలుచున్న చోట్లపైనా ఆసక్తి
- సామూహికంగా ఫలితాలు చూసేలా ఏర్పాట్లు

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 2 : 'అన్నా తెలంగాణల.. గెలిచేది కారే.. వచ్చేది సారే'...

' చెయ్యిదే పైచేయి గుర్తుంచుకో అన్నా.. తెలంగాణల దానిదే హవా బెట్టుకు రెడీ'

ఇలా తెలంగాణ మొత్తంపై బెట్టింగ్‌లు జోరుగా నడుస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వేళ ప్రధాన నియోజకవర్గాలపై బెట్టింగ్‌లు ఊపందుకున్నాయి. ఇవి ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికో, పక్కనున్న ఎల్బీనగర్ నియోజకవర్గానికో పరిమితం కాలేదు. రాష్ట్రంలో హాట్ టాపిక్ అయిన, ప్రధాన అభ్యర్థులు, ప్రముఖులు నిలబెడిన చాలా నియోజకవర్గాలపై బెట్టింగులకు దిగుతున్నారు. 'అన్నా.. ఏమంటవే. ఏది గెలుస్తది. బెట్టు కట్టిన.. వొస్తయంటవా పైసల్' అంటూ తెలిసినోళ్లకు ఫోన్‌లు చేసి ఆరా తీస్తున్నారు. మరికొందరు టీవీలో చర్చలు, యూట్యూబుల్లో విశ్లేషణలు తదేకంగా చూసేస్తున్నారు. సర్వేల్లో ఫలితాలు చూసి మురిసిపోతున్నారు.

### ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాలుగోసారి విజయం సాధిస్తుందని కొందరు, ఈసారి సీటును కొట్టేది కాంగ్రెస్సేనని మరికొందరు బెట్టింగులు కాస్తున్నారు. ఇంటర్ పూర్తయిన యువకుడి నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారుల వరకు పందేలు కాసేందుకు ఇష్టపడుతున్నారు. ఆ బెట్టింగ్‌లు రూ.5 వేలు మొదలుకొని రూ.లక్ష వరకు కాస్తున్నారు. బెట్టింగ్ కట్టి ఊరుకోవడంలేదు. అసలు గెలుపునకు ఏయే అంశాలు దోహదం చేస్తాయి, ఎలా దోహదం చేస్తాయో సైతం తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఒకే పార్టీకి చెందిన మరికొందరు గెలుపు పక్కా అయిపోయింది, మెజార్టీపై బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. బెట్టింగ్‌లు పెరగడంతో ఎన్నికల ఫలితాలపై మరింత ఉత్కంఠ పెరిగింది.

### ఒకేచోట కూర్చుని ఫలితాలు చూసేలా..

సర్వేలు పూర్తి మెజార్టీ ఎవ్వరికీ ఇవ్వకపోవడం, కౌంటింగ్‌కు ఆదివారం కలిసి రావడంతో ప్రజల్లో మరింత ఆసక్తి పెరిగింది. పార్టీల వారు ఒకేచోట పార్టీ కార్యాలయాల నుంచి ఫలితాలు చూడాలని నిర్ణయించుకున్నారు. ఇదిలా ఉంచితే, యువకులు, రియల్టర్లు ఎవరికి వారు ఒకేచోట నుంచి ఫలితాలను వీక్షించేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరో వరల్డ్ కప్ ఫైనల్‌ను తలపించేలా ముందుగానే అంతా సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకోసం మందు, భోజనాలు సైతం ఒకేచోట చేసేలా సన్నద్ధమవుతున్నారు.

### అక్కడి ఫలితాలపైనా ఆసక్తి

మున్సిపాలిటీ ప్రజలే కాదు, జిల్లాలోని చాలామంది రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో ఫలితాలపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అందులో ముఖ్యంగా కామారెడ్డి, గజ్వేల్, కొడంగల్, కోరుట్ల, సిరిసిల్ల, ఎల్బీనగర్, మహేశ్వరం, కల్వకుర్తి, మహబూబ్‌నగర్, కొల్లాపూర్, మునుగోడు, మేడ్చల్, పాలేరు.. ఇలా మరెన్నో నియోజకవర్గాల్లో ఫలితాలపై ఆసక్తిగా ఉన్నారు. అక్కడ ఎవరు గెలుస్తారు, ఎంత మెజార్టీ వస్తుంది, ఎలా సాధ్యం.. ఇలా పలు అంశాలపై విశ్లేషణలు చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో గెలుపోటములపైనా ఇక్కడ బెట్టింగ్‌లు పెడుతున్నారు. ఈ బెట్టింగుల ఫలితాలకు మరికొన్ని గంటల్లోనే ఫుల్ స్టాప్ పడనున్నది.



గుండంకు వెళ్లే మెట్ల దారి